

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, మే 10: బాల్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ బోధన జరిపిస్తామని, హాస్టల్ వసతి, పుస్తకాలు, యూనిఫాం ఉచితంగానే అందజేస్తామన్నారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తీర్చిదిద్దుతామని, కంప్యూటర్ ల్యాబ్, కేవైఎ ప్రాజెక్టులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

సాయంత్రం 5 వరకే..



నేటితో ముగియనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

- చివరి సమయంలో జోరు పెంచిన పార్టీ అభ్యర్థులు
- ఓటర్ల నాడి పట్టేందుకు పోటాపోటీ ప్రయత్నాలు
- జిల్లాలో మోహరించిన కేంద్ర ప్రత్యేక బలగాలు
- డబ్బు, మద్యం తరలింపుపై పోలీసుల నిఘా
- పార్లమెంట్ పరిధిలో 17లక్షల 4,867 మంది ఓటర్లు
- మొత్తం 1808 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో పార్టీలు ప్రచారంలో మరింత వేగాన్ని పెంచాయి. సుడిగాలి పర్యటనలతో అభ్యర్థులు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంటను చుట్టేస్తున్నారు. అన్ని రకాల ప్రలోభాలతో పాటు రహస్య మంతనాలు జరుపుతున్నారు. భారీ హామీలను గుప్పిస్తూ ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అసమ్మతి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహరచనతో ముందుకు సాగుతున్నారు. చివరి సమయంలో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

నిజామాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియనుంది. సాయంత్రం 5గంటలకు ప్రచారాలకు తెరపడనుంది. దీంతో పార్టీ అభ్యర్థులు చివరి సమయంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్ల నాడి పట్టేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్‌కు ముందు 48గంటలు సమయం ఉండటంతో పూర్తిస్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 17లక్షల 4,867 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుష ఓటర్లు 8లక్షల 6,130 మంది, మహిళా ఓటర్లు 8లక్షల 98,647 మంది ఉన్నారు. వీరే కాకుండా 90 మంది ఇతరులు ఉన్నారు. వీరందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఓటర్లు ఓటు హక్కును సజావుగా వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. 7వేల మందికి పైగా ఉద్యోగులను ఈ ఎన్నికల కోసం వినియోగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో కేంద్ర బలగాలతో పాటు జిల్లా బలగాలు మోహరించి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. మద్యం, డబ్బు పంపిణీపై నిఘా పెట్టారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ప్రశాంతంగా ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు

పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచే ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది వాహనాల ద్వారా తరలించనున్నారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లతో పాటు ఎన్నికలకు కావాల్సిన సామగ్రిని తీసుకొని వెళ్లనున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి అదే కేంద్రాల్లో అప్పచెప్పనున్నారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ఇప్పటికే ఉద్యోగులందరికీ శిక్షణ ఇచ్చారు. మాక్ పోలింగ్ నిర్వహణతో పాటు ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ ఎండను దృష్టిలో పెట్టుకొని గంట సమయం పెంచడం వల్ల సాయంత్రం 6గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశాన్ని కల్పించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఏజెంట్ల సమక్షంలో సీల్ వేసి ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను రిసెప్షన్ కేంద్రాలకు తరలించనున్నారు. అక్కడి నుంచి డిచ్‌పల్లిలోని కౌంటింగ్ కేంద్రానికి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలోని ఈవీఎంలను తరలించి భద్రపరుస్తారు. జూన్ 4న లెక్కింపు ఉండటంతో అప్పటి వరకు కేంద్ర బలగాల ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

అధికారుల నియామకం

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా సెక్టోరియల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, నోడల్ అధికారులను నియమించారు. అన్ని అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు ఈ ఎన్నికలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తుండగా జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా ఉండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతను పర్యవేక్షించేందుకు బలగాలను దించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందే గుర్తించడంతో ఆ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించనున్నారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ కూడా చేయనున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ అయ్యే అవకాశం ఉండటంతో అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలను పెంచారు. బ్యాంక్ లావాదేవీలపై కూడా నజర్ పెట్టారు. ఏయే బ్యాంకుల్లో ఎక్కువ మొత్తంలో ఏ ఖాతా నుంచి లావాదేవీలు అవుతున్నాయో పరిశీలిస్తున్నారు. మల్టిపుల్ అకౌంట్‌కు నిధులు ట్రాన్స్‌ఫర్ అయితే వాటిపై నిఘా పెట్టి పరిశీలిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని మద్యం షాపుల అమ్మకాలపై కూడా దృష్టి సారించారు. ఏ షాపుల నుంచి ఎక్కువగా మద్యం తీసుకున్నారో పరిశీలిస్తూ ఆరా తీయడంతో పాటు ఏరోజుకు ఆరోజు నివేదికలను రిటర్నింగ్ అధికారులతో పాటు ఎన్నికల పరిశీలకులు పరిశీలిస్తున్నారు. మొత్తంగా జిల్లా అధికారులు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాలు చేశారు

- సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నారు
- పదేళ్ల బీజేపీ పాలనలో రైతులను, ప్రజలను పట్టించుకోలేదు
- విలేకరులతో మండవ వెంకటేశ్వర్‌రావు

నిజామాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఏర్పాటయ్యేటప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ఆరోపించారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్‌లోని కృష్ణ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రెండు సవాళ్లు ఉన్నాయన్నారు. ఒకటి కేసీఆర్ చేసిన అప్పులు తీర్చడం. రెండవది ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడమని అన్నారు. కేసీఆర్ ఉన్న పదేళ్లలో 7లక్షల 50వేల కోట్ల అప్పులను చేశారని అన్నారు. వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని అన్నారు. కేసీఆర్ పదవి దిగిపోయినప్పుడు రూ.7,500 కోట్లు రైతుబంధు వేశానని చెబుతున్నారని మరి రైతుల ఖాతాల్లోకి ఎందుకు రాలేదని మండవ వెంకటేశ్వరరావు అన్నారు. రైతుబంధు హామీలో భాగంగా ప్రస్తుతం పాత పథకం ప్రకారమే డబ్బులను రైతుల ఖాతాల్లో వందశాతం వేశామన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరాకు 15వేల రూపాయలు రెండు విడతల్లో అందిస్తామన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి ఐదు విడతల్లో చేయలేదన్నారు. అది రైతులకు వడ్డీ పెరిగి 2లక్షల రూపాయల వరకు అయిందన్నారు. వీటిని సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతతో ఆగస్టు 15వ తేదీ వరకు మాఫీ చేస్తామన్నారన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ కూడా ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజలకు ఆదాయం పెంచుతామని చెప్పి అన్ని ధరలు పెంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులతో పాటు అందరిని ఆదుకుంటుందన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర కల్పిస్తామన్నారు. చదువుకొని పైకి వచ్చిన యువతకు స్టార్టప్ ద్వారా లక్ష రూపాయల వరకు అందించి బిజినెస్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పనులే ఇప్పుడు గ్రామాల్లో పేదలకు ఆధారంగా ఉన్నాయన్నారు. పనులు చేసుకున్న వారికి రూ.200లకు మించి రావడం లేదన్నారు. దానిని 400 రూపాయలకు పెంచుతామన్నారు.

ఎన్నికల్లో పార్టీలు హామీలు ఇవ్వడం సహజమే..
: కర్ణాటక మంత్రి బోసురాజు

ఎన్నికల్లో పార్టీలు హామీలు ఇవ్వడం సహజమేనని మొదటి సారిగా గ్యారంటీల పేరుమీద కాంగ్రెస్ కర్ణాటకలో ఇచ్చి అమలు చేసిందని ఆ రాష్ట్ర మంత్రి బోసురాజు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో గ్యారంటీలకు వచ్చిన స్పందన బాగుందన్నారు. మహిళలు, యువకులు సానుకూలంగా స్పందించారన్నారు. కర్ణాటకలో గ్యారంటీలకు ఈ 56వేల కోట్ల రూపాయలు కేటాయించి అమలు చేస్తున్నామన్నారు. ఇదే పద్ధతిని తెలంగాణలో కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చి విజయం సాధించామని ఆయన అన్నారు. మరికొద్దిరోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని గ్యారంటీలను అమలు చేస్తారని అన్నారు. అదే స్ఫూర్తితో కేంద్రంలో కూడా రాహుల్‌గాంధీ పాంచ్ న్యాయ్ పేరు మీద ఐదు గ్యారంటీలను ప్రజలకు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలు ప్రకటించి నిలబడిందన్నారు. వీటిని ఎద్దేవా చేసిన ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల్లో ప్రకటించారని ఆయన ఎద్దేవా చేశారు. పేద ప్రజలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

మోదీ మానియా పేరిట బీజేపీ నేతల ప్రచారం

- ఎంపీగా అర్వింద్ ఐదేళ్లలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు
- కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఏనాడు పేదల సమస్యలను పట్టించుకోలేదు
- నన్నుగెలిపిస్తే నిజామాబాద్ పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- మీట్ ది ప్రెస్ లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ మానియా పేరుమీద కొంత మంది బీజేపీ నాయకులే ప్రచారం చేస్తున్నారు. అర్వింద్ ముఖ్యం కాదు.. మోదీ ముఖ్యమని అంటున్నారు. గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్ ఒక్కరోజు కూడా పార్లమెంట్‌లో సమస్యలను ప్రస్తావించలేదు" అంటూ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ ఇచ్చిన పసుపు బోర్డు, గల్ఫ్ బోర్డు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించడం వంటి హామీలు ఆచరణకు నోచుకోలేదని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ దేశ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మూడున్నరలక్షల కోట్ల అప్పులు చేసినా అభివృద్ధి చేసిందన్నారు. ప్రశ్నించే వారిని బెదిరించి జైల్లో పెడుతున్నారని అన్నారు. ఎంపీ అర్వింద్ హిందుత్వం పేరిట ప్రజలను రెచ్చగొట్టడం తప్ప ఐదేళ్లలో చేసింది శూన్యమని బాజిరెడ్డి అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకే షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ప్రకటన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటీ పడి మళ్లీ తెరిపిస్తామని రైతులను మభ్యపెట్టే విధంగా ప్రకటనలు చేస్తున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్ ఎమ్మెల్సీ కవిత అని, తన ప్రచారంతో పాటు పోస్టర్‌లో కూడా ఆమె ఉందన్నారు. ప్రధానిని ప్రశ్నించినందుకే ఈడీ, సీబీఐ ద్వారా కేసులు పెట్టించి జైల్లో వేశారని ఆయన ఆరోపించారు. ఎంఐఎం పార్టీ క్యాడర్ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తుందని తాను భావిస్తున్నానని బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారని ప్రచారం జరుగుతున్న ఆ పార్టీ నేత ప్రియాంక గాంధీ అసదొద్దీన్ ఓవైసీ బీజేపీ ఏజెంటేనని ప్రకటనలు చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 సీట్ల వరకు బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్నారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.



వేల్పూర్‌లో ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..

భీమ్‌గల్ రూరల్: కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెండోరా గ్రామంలో అర్వింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో దేశం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టే పథకాలు దేశానికే దిక్సూచిలాంటివని అర్వింద్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. బీజేపి అభ్యర్థిగా ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. దేశంలో బీజేపీకి 370 ఎంపీ సీట్లు రావడం ఖాయమని అర్వింద్ అన్నారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం : అర్వింద్

వేల్పూర్, మే10: పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని, ఆ పార్టీకి చెందిన కొందరు మంత్రులు తులుచుకుంటే ప్రభుత్వం పడిపోతుందని ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తొందరగా కూలిపోవాలని మొక్కి బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు తలుచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమన్నారు. దేశం మొత్తంలో కాంగ్రెస్ రెండు రాష్ట్రాల్లో ఉందని, అవి కూడా ఎక్కువ రోజులు ఉండబోవన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఉగ్రవాద సంస్థలు లెటర్‌లు రాస్తున్నాయన్నారు. ఐఎస్ఐ, తాలిబన్‌లతో లింక్ ఉన్న సిమీ సంస్థ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని బహిరంగ లేఖ రాస్తుందన్నారు. మరొక ఉగ్రవాద సంస్థ పీఎఫ్ఐ కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్కన్నగారి మోహన్, నాయకులు తీగెల మోహన్, బాస గంగాధర్, బోంపెల్లి గంగాధర్, బద్దం రాజారెడ్డి, నోముల నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు..

ముప్కాల్: బాల్కొండ మండలంలోని శ్రీరాంపూర్ మాజీ సర్పంచ్ మంతెన చిన్నయ్య, బాల్కొండ మాజీ ఎంపీటీసీ సిరియల జగన్ శుక్రవారం తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరగా వారికి ధర్మపురి అర్వింద్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కేంద్రంలో మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు తెలిపారు. ధర్మపురి అర్వింద్ గెలుపే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, తోట చిన్నయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

• మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి • ఈవీఎంల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు • కలెక్టర్లతో వీసీలో సీఈవో


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి


పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్, మే10: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఈనెల 13న జరుగనున్న పోలింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఇటీవలే శాసనసభ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని సీఈవో ప్రస్తావిస్తూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలను మరింత మెరుగైన రీతిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా పోస్టల్ బ్యాలెట్‌లను వేరుచేస్తూ సంబంధిత సెగ్మెంట్‌కు పంపించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిసిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి తడిసిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్‌లు అందుబాటులో ఉన్నచోట్ల కూలర్లు వంటి వసతులు కల్పించాలన్నారు. పోలింగ్‌కు మరికొన్ని గంటల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున నగదు, మద్యం, విలువైన వస్తువుల వంటి వాటిపై గట్టి నిఘా పెట్టాలని ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలన్నారు. ముఖ్యంగా సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మాక్‌పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఈసీ మార్గదర్శకాలను పాటించాలని అన్నారు. ఎక్కడ కూడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని పోలీస్ బందోబస్తు మధ్య వాటిని తరలించాలని సెక్టోరియల్ అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవా ఆదేశించారు. మహిళలు, యువత, దివ్యాంగులకు పోలింగ్‌లో భాగస్వామ్యం అయ్యేలా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి సదుపాయాలను సరిచూసుకోవాలని సూచించారు.

13న పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలు

ఖిల్లా, మే 10: ఈనెల 13న పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నందున ఆయా పోలింగ్‌బూత్‌ల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 144 సెక్షన్ అమలు చేయడంతో ఒక్కరి కంటే ఎక్కువ మంది ఒకేచోట గూమిగూడొద్దని పేర్కొన్నారు. 130/3 ఎక్కువ మంది గూమిగూడి ఉండాలంటే సంబంధిత అధికారి అనుమతి తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. 130/4 పోలింగ్ బూత్ నుంచి 100 మీటర్ల లోపల ఉన్న ఇంటి వద్ద దగ్గర ఉన్న ఇళ్లలో బయటివారికి షెల్టర్ ఇవొద్దని పేర్కొన్నారు. 130/5 ఫంక్షన్ హాళ్లలో, లాడ్జిల్లో ఎక్కువ మంది ప్రచారం కోసం అనుమతి ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

• రెండు రోజులు మద్యం దుకాణాల బంద్

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున 11న సాయంత్రం 5గంటల నుంచి 14వ తేదీ ఉదయం 10గంటల వరకు మద్యం దుకాణాలను మూసి ఉంచనున్నట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.


రైతులతో కలిసి టీ తాగుతూ ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

కేసీఆర్ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

• ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, మే 10: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మాజీ సీఎం కేసీఆర్ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో బుస్సాపూర్‌గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో కొద్దిసేపు రైతులతో కలిసి టీ స్టాల్ వద్ద టీతాగుతూ నాడు కేసీఆర్ చేసిన పనులను గుర్తుచేశారు. అనంతరం ఉపాధిహామీ కూలీలతో ముచ్చటించారు. గత తొమ్మిదేళ్లుగా పరిపాలించిన మాజీ సీఎం కేసీఆర్ బడుగు బలహీనవర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా ఎదుగుదలకు కృషిచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోరని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, ఏలేటి శ్రీనివాస్, గోపిడి గంగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నూతన షిఫ్ట్ వాహనం


నూతన వాహనాన్ని విడుదల చేస్తున్న ఆర్‌టీవో ఉమామహేశ్వర్‌రావు

నిజామాబాద్ అర్బన్, మే10: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజీకీ ఆల్ ఇండియా నెంబర్ వన్ డీలర్ అయిన వరుణ్ మోటార్స్‌లో నెక్స్ జెనరేషన్ షిఫ్ట్ కారును శుక్రవారం నిజామాబాద్ ఆర్‌టీవో ఉమామహేశ్వరరావు మార్కెట్‌లోకి విడుదల చేశారు. మొదటి రెండు కార్లను మురళీకృష్ణ, సయ్యద్ అలీ రహమాన్‌లకు అందజేశారు. నూతన షిఫ్ట్ ఐకానిక్ బ్రాండ్ అని ఇప్పటివరకు 29లక్షలకు పైగా కస్టమర్ల ప్రేమను అందుకొని కొత్త నాల్గో జనరేషన్ షిఫ్ట్ సరికొత్త జూట్రిక్స్ ఇంజన్‌తోపాటు 25 కిలోమీటర్ల మైలేజీతో మార్కెట్‌లోకి వచ్చిందన్నారు. 6 ఎయిర్ బ్యాగ్స్‌తో కొత్త సస్పెషన్స్ సెటప్‌తో 6లక్షల 48వేల ప్రారంభ ధర, 9లక్షల 64వేల వరకు వివిధ వేరియంట్‌లలో లభిస్తుందని వరుణ్ మోటార్స్ జనరల్ మేనేజర్ రమణ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం సుమన్, సేల్స్ మేనేజర్ అశోక్ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇప్పించడానికి కృషి చేస్తా

• బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్వింద్

పెద్దబజార్, మే10: సాధ్యమైనంత త్వరగా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇప్పించడానికి కృషిచేస్తానని నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదల అభివృద్ధి సంక్షేమ కోసం అమలు చేస్తున్న ఎన్నో పథకాల ద్వారా లబ్ధిపొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి, రేషన్‌కార్డులు లేక లక్షలాది మంది పేదలు లబ్ధిపొందలేకపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులను అందజేస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఇతర పరిశ్రమలను నెలకొల్పడం, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చడం, మౌలిక వసతులు కల్పించడం, నైపుణ్యాలను పెంపొందించడం, విలువ ఆధారిత పెట్టుబడి దారులను ఆకర్షించడం ద్వారా కనీసం 25వేల మందికి పైగా యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పిస్తానన్నారు. కేంద్రప్రభుత్వ నూతన విధానాలకు అనుగుణంగా చెరకు ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్నారు. పసుపు, వరి, మొక్కజొన్న, చెరకు, మామిడి, ఆధా రిత పరిశ్రమలను నెలకొల్పడం రైతుల పంటలకు మేలైన ధరలు లభించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, బీజేపీ నాయకులున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, మే10: మండలకేంద్రంలో మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియేట్ ప్రవేశానికి ఈనెల 31తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.


కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

టైంపాస్ అభ్యర్థిని మరోసారి నమ్మి నష్టపోవద్దు

• పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి పత్తా లేకుండా పోయాడు
• పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్, మే10: ఐదేళ్లుగా ఎంపీగా గెలిచి ప్రజలకు అర్వింద్ చేసింది ఏమీ లేదని బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ప్రజలు టైంపాస్ అభ్యర్థిని మరోసారి నమ్మి పోసపోవద్దని బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లిలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం గోనెరెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. పట్టభద్రుల ఓట్లతో ఎమ్మెల్సీగా గెలిచి జీవన్‌రెడ్డి పత్తాలేకుండా పోయారని అన్నారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న అర్వింద్ ఏమీ అభివృద్ధి చేయలేదని ప్రస్తుతం నరేంద్రమోదీని చూసి ఓటు వేయాలని అడుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ గ్యారంటీలలో ఏ ఒక్క గ్యారంటీ అమలు చేయలేదని అన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకోసం పనిచేసిన వ్యక్తినని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్‌ప్రభుత్వం డీఎస్ హయాంలో నిజామాబాద్ అభివృద్ధి జరగలేదని, గత పదేళ్లలో ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, సిర్పరాజు, ధర్మపురి నర్సయ్య, రవిచంద్ర, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

మాదాపూర్‌లో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం

జక్రాన్‌పల్లి, మే10: మండలంలోని మాదాపూర్ గ్రామంలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. శుక్రవారం గ్రామంలో వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన క్రీడా అధికారి ముత్తెన్న సందర్శించారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్, వాలీబాల్ నెట్టు అందించారు. ఈ సందర్భంగా ముత్తెన్న మాట్లాడుతూ వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడల్లో ఆడేందుకు ఎంపికయ్యే విధంగా మేళకువాలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ వెంకటేష్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి, క్రీడాకారులు, విజేత యూత్ సభ్యులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

నగరంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

ఖిల్లా, మే 10: పోలీసు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతును శుక్రవారం నగరంలో నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల దృష్టిలో పెట్టుకుని రెండో పోలీసుస్టేషన్ పరిధిలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. స్వేచ్ఛా, నిష్పక్షపాతంగా ఎన్నికల కోసం ప్రజలకు మేము ఉన్నామనే నమ్మకాన్ని కల్పించడం, ప్రజలు నిర్భయంగా ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటును వినియోగించుకునేందుకు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకు ఈ కవాతు ముఖ్య ఉద్దేశ్యమని నగర ఇన్స్‌పెక్టర్ నరహరి అన్నారు. కవాతులో సెంట్రల్ రిజర్వు ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కుతుబుద్దీన్, యాదవ్, రెండవ టౌన్ ఎస్సై ఎల్.రామ్, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ కోటేశ్వర్‌రావు, శంకర్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి పర్యవేక్షణలో ఈ కవాతును నిర్వహించారు.


విద్యుత్ తీగలపై వేలాడుతున్న మృతదేహం


బాదావత్ రవి (ఫైల్ ఫొటో)

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

సిరికొండ, మే10: బోరుబావికి కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఘటన సిరికొండ మండలం వర్ష్యాన్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ష్యాన్‌తండాకు చెందిన బాదవత్ రవి శుక్రవారం ఉదయం తనపొలం వద్ద గల బోరు మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ తీగలను పరిశీలిస్తుండగా.. అకస్మాత్తుగా విద్యుత్ సరాఫరా కావడంతో రైతు బాదవత్ రవి (42) అక్కడిక్కడి మృతిచెందాడు. అటుగా వెళ్లిన రైతులు రవి చనిపోయిన దృశ్యాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రవికి భార్య లలిత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. అయితే తండాకుచెందిన బానావత్ గణపతి తన పొలం వద్ద గోడ నిర్మాణానికి నీరు అవసరం ఉండి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్‌చేయడంతో విద్యుత్ సరాఫరా జరిగిందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారిణి

ముప్కాల్, మే 10: పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారిణి వాలిసవ్రజ ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ మండలకేంద్రంతోపాటు శ్రీరాంపూర్, చిట్టాపూర్, వన్నెల్(బి), బోదేపల్లి, కిసాన్‌నగర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో తాగునీరు, కరెంటు సరఫరా, టెంటు, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు, దివ్యంగుల అవసరమైన వీల్ చైర్‌లు వసతులు సరిగ్గా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎస్సై గోపి, డీటీ వినోద్, మండల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఝూటా మాటలు నమ్మవద్దు

• కాంగ్రెస్‌తోనే దేశ సమగ్ర అభివృద్ధి: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


ఊట్‌పల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, మే10: బీజేపీ, బీఆర్ఎస్ ఝూటా మాటలు నమ్మి మోసపోవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్‌తోనే దేశసమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తాండా, ఊట్‌పల్లి, అమ్దాపూర్, బెల్లాల్, ఎరాజ్‌పల్లి గ్రామాలతోపాటు పట్టణంలోని పలు వార్డులలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని, ఆ పార్టీల ఝూటా మాటలను నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీతాళాలను తెరవడం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన హామీనిచ్చారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. అర్హులైన వారందరికీ పట్టాపాస్ పుస్తకాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. సోమవారం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై. నరేందర్‌రెడ్డి, అల్లె రమేష్, అమ్దాపూర్ పలెన్న, సాయిలు, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, గణపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్: దేశం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, పదేళ్ళు అధికారంలో ఉన్న బీజేపీ పేదలను దోచి పెద్దలకు పంచిదే తప్ప బడుగు, బలహీన వర్గాలకు చేసింది ఏమీలేదని అన్నారు. శుక్రవారం మండలంలోని నీలా గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెందారని, దేశ నాయకత్వం రాహుల్ గాంధీ వైపు మొగ్గు చూపుతుంద అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొబీన్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజ్జనార్‌పై ఈసీ చర్యలు తీసుకోవాలి

• జీవన్‌మాల్‌పై కక్ష సాధింపు చర్యలు
• బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే10: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కాంగ్రెస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నాడని, సజ్జనార్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకోకుండా ఆర్మూర్‌లోని జీవన్‌మాల్‌ను సీజ్‌చేస్తామంటూ నోటీసులు ఇవ్వడంతోపాటు తన పేరును చెడగొట్టేలా వాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.7.5 కోట్లు బకాయి ఉండగా.. అందులో కొంతమొత్తం చెల్లించామని, మిగతాది త్వరలోనే కడతామని చెప్పినా మాల్ సీజ్ చేస్తామని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గురువారం జీవన్‌మాల్‌లో సుమారు 200 మందిని అక్రమంగా చొరబడి భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. ఇప్పటికే ఎండీ సజ్జనార్‌పై స్థానిక ఏసీపీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సజ్జనార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని లేఖ రాసినట్లు తెలిపారు. ఇప్పటికే 1.76కోట్ల జీఎస్టీ చెల్లించామని, ఆ సొమ్మును కేంద్రానికి చెల్లించలేదని, ఈ అంశంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థలో కొత్త బస్సుల కొనుగోళ్లు, స్క్రాప్ అమ్మకం, టైర్ల కొనుగోలు వంటి వాటిలో పెద్ద ఎత్తున కమీషన్ తీసుకున్నట్లు ఆరోపణలు చేశారు. ఆయన అక్రమాస్తులపై విచారణ జరపాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతుకిరణ్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,000	రూ.67,400	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (10.30)
: కృష్ణమ్మ (1.40, 7.45, 10.40)
: బాక్ (4.35)
స్క్రీన్-2 : కృష్ణమ్మ (10.20),
: ప్రతినిధి-2 (1.15)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.10)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (7.20 10.30)
స్క్రీన్-3 : శ్రీకాంత్ (హిందీ) (10.25, 1.25, 7.20, 10.20)
: ఆ ఒక్కటి అడక్కు (4.25)
స్క్రీన్-4 : ప్రతినిధి -2 (10.40, 7.35, 10.30)
: ఆరంభం (1.35), ప్రసన్నవధనం (4.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: ప్రతినిధి-2 (10.45, 4.30, 10.30)
: కృష్ణమ్మ (1.35)
: ఆ ఒక్కటి అడక్కు (7.30)
స్క్రీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (1.40)
: బాక్ (4.30)
: కృష్ణమ్మ (7.30, 10.30)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (10.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (1.45, 4.40, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహాల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్